క్లుప్తంగా

బ్యాంకు అధికారుల ధర్నా

చిత్తూరు రూరల్ (కాణిపాకం): యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంకు యూనియన్ల పిలుపు మేరకు చిత్తూరులోని ఎస్‌బీఐ బ్యాంకు ఎదుట శుక్రవారం ఆ ఉద్యోగులు ధర్నా చేశారు. వారు మాట్లాడుతూ, ఔట్ సోర్సింగ్ విధానాన్ని రద్దు చేయాలని, వారానికి ఐదు రోజుల పనిదినాలు కల్పించాలని, పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. గతంలో కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారం 15 రోజుల్లో సమస్యలు పరిష్కరించాలని, లేనిపక్షంలో మార్చి 24, 25 తేదీల్లో దేశవ్యాప్తంగా ధర్నా చేస్తామని హెచ్చరించారు.

104లో వైద్య పరీక్షలు



గర్భిణికి వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్

ఐరాల: మండలంలోని దివిటివారిపల్లెలో శుక్రవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 104 వాహనంలో వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. పీహెచ్‌ఎస్ జీవకళ, హెల్త్ సూపర్‌వైజర్ చిన్నమ్మ, హెల్త్ అసిస్టెంట్ సుధాకర్, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

ఆరోగ్యమే శ్రీరామరక్ష



రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ మోహన్‌వేలు

తవణంపల్లె: ప్రతి ఒక్కరికి ఆరోగ్యమే శ్రీరామరక్షని తవణంపల్లె వైద్యాధికారి డాక్టర్ మోహన్‌వేలు అన్నారు. శుక్రవారం మండలంలోని ఉప్పాంకలో ఫ్యామిలీ డాక్టర్ నిర్వహించి రోగులను ఆయన పరీక్షించారు. మందులు పంపిణీ చేసి మాట్లాడారు. హెల్త్ అసిస్టెంట్ సుబ్రమణ్యం రెడ్డి, ఏఎన్‌ఎం, ఎంఎల్‌హెచ్‌పీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

చీలాపల్లెలో 'ఫ్యామిలీ డాక్టర్'



వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్ అనూష

గుడిపాల: మండలంలోని చీలాపల్లెలో శుక్రవారం బొమ్మసముద్రం ప్రాథమిక వైద్యాధికారి అనూష ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. రోగులను పరీక్షించి మందులు అందజేశారు. అనంతరం మంచానికే పరిమితమైన రోగుల ఇళ్లకు వెళ్లి వారి ఆరోగ్యం ఎలా ఉందో తెలుసుకుని సలహాలు–సూచనలు ఇచ్చారు. వైద్యసిబ్బంది శిరీష, ఉమామహేశ్వరి, సుప్రియ పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం



గ్రామ కార్యదర్శుల మండల అసోసియేషన్ నూతన కార్యవర్గం

బంగారుపాళెం: మండల గ్రామ కార్యదర్శుల అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా చెంగల్‌రాయన్, ఉపాధ్యక్షురాలిగా కవితా ప్రియదర్శిని, కార్యదర్శిగా గుణశేఖర్, ఉపకార్యదర్శులుగా హరిత, రెహమాన్, కోశాధికారిగా అవంతి, సభ్యులుగా ఆల్బర్ట్ వెస్లీ, రఘుపతి, గౌరీశంకర్, నస్రీన్, కార్తీక్, రాజేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గ్రామ కార్యదర్శుల సమస్యలు పరిష్కరించేందుకు తమ వంతు కృషి చేస్తామని నూతన కమిటీ సభ్యులు తెలిపారు.

అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ల నియామకం



మోహనకుమారి



జ్యోతిరామ్

చిత్తూరు అర్బన్: చిత్తూరులోని బాలలపై లైంగిక దాడుల విచారణ కోర్టు (పోక్సో) ఏపీ పీగా వి.మోహనకుమారి, 8వ అదనపు జిల్లా సెషన్స్ న్యాయస్థానం ఏపీపీగా ఎ.జ్యోతిరామ్ ను నియమిస్తూ రాష్ట్ర న్యాయశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. మూ డేళ్ల పాటు వీళ్లు ఏపీపీలుగా కొనసాగుతారు.

హృదయ రక్షణపై సదస్సు

పూతలపట్టు(కాణిపాకం): పూతలపట్టు మండలం పి.కొత్తకోట సామాజిక ఆరోగ్య కేంద్రంలో హృదయ రక్షణ కార్యక్రమంపై శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వైద్యులు కుమార్ రాజ మాట్లాడుతూ, గుండె పోటుకు గురైన వారికి స్టెమీ అండగా నిలుస్తోందన్నారు. ఈ స్టెమీ సెంటర్‌కు వచ్చే గుండె పోటు బాధితులకు తక్షణం ఈసీజీ తీసి గుండె పోటు నివారణకు 45వేల రూపాయల విలువ చేసే ఇంజక్షన్ ఉచితంగా వేస్తామని, దీనిని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. అనంతరం పోస్టర్లను ఆవిష్కరించారు. వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మా బతుకులు బస్టాండులోనే..!

- ఎమ్మెల్యే ఆగడాలకు అంతులేదా..?
- ప్రాణాలు పోయినా వెళ్లేది లేదు
- తేల్చి చెప్పిన వ్యాపారులు
- బాధితులకు అండగా వైఎస్సార్‌సీపీ ధర్నా

చిత్తూరు అర్బన్/కార్పొరేషన్: చిత్తూరు ప్రజలకు పాత బస్టాండుతో విడదీయరాని అనుబంధం ఉంది. అక్కడి వ్యాపారులకు తరతరాలుగా అన్నం పెడుతున్న స్థలమది. ఇప్పుడా బంధానికి, అన్నం పెడుతున్న స్థలానికి కూటమి ప్రభుత్వం అడ్డుగోడలు కట్టాలని నిశ్చయించుకుంది. అధికార దర్పంతో వర్తకులను ఖాళీ చేయించాలని ఒత్తిళ్లు తేవడంతో వ్యాపారులు సంఘటితమయ్యారు. అధికారులకు తమ గోడు నివేదించారు. నిరసన వ్యక్తం చేసినా పట్టించుకోకపోవడంతో వైఎస్సార్‌సీపీ చిత్తూరు నియోజకవర్గ సమన్వయకర్త విజయానందరెడ్డిని కలిసి ఆక్రోశం వెళ్లగక్కారు. బాధితలకు అండగా నిలబడిన ఆయన పార్టీ జిల్లా అధ్యక్షుడు కరుణాకర్‌రెడ్డి నేతృత్వంలో శుక్రవారం బస్టాండులో భారీ ఎత్తున ధర్నా చేశారు. పలువురు వ్యాపారులు తమ వెతలు చెప్పుకుని కన్నీటిపర్యంతమయ్యారు. కార్యక్రమంలో నాయకులు, ప్రజా ప్రతినిధులు, వ్యాపార సంఘం నాయకులు కేపీ శ్రీధర్, జయపాల్, ప్రకాష్, చాన్‌బాషా, రాహుల్ రెడ్డి, అను, రజనీకాంత్, సరళమేరి, అంజలిరెడ్డి, ప్రతిమారెడ్డి, కృష్ణారెడ్డి, మధుసూదన్, మనోజ్‌రెడ్డి, రాజేష్‌రెడ్డి, అల్తాఫ్, లక్ష్మణస్వామి, మధురెడ్డి, నారాయణ, త్యాగ, అమరనాథరెడ్డి, ఇమ్రాన్, చాపు, చామంతి, సురేష్, శివ, ఉన్ని, శేఖర్, రాజశేఖర్, శరవణ,హరీషారెడ్డి, అప్పాజీ, దయాళన్, రవి, మోహన్, మున్నా, ఇబ్రహీం, బాబీ, సాదిక్, బాబు, శకుంతల, రఫీ, అక్బర్, నజీర్, మస్తాన్, సయ్యద్‌బాషా తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న విజయానందరెడ్డి, పక్కన కరుణాకరరెడ్డి, చంద్రశేఖర్

ఎమ్మెల్యే కన్ను పడితే ఆక్రమించడమేనా..?



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 8 నెలలవుతోంది. చిత్తూరు ఎమ్మెల్యే ప్రజా సేవకు బదులు తన వ్యవహార శైలితో ప్రజాకంటకుడిగా అయ్యారు. ఏ స్థలం మీదైనా కన్ను వేస్తే చాలు ఆక్రమించడం తన నైజంగా మార్చుకుని జేబులు నింపుకుంటున్నారు. ఎన్ని ప్రభుత్వాలు మారిన పాత బస్టాండ్ జోలికి ఎవరూ వెళ్లలేదు. కానీ కూటమి ప్రభుత్వం వచ్చాక విలువైన స్థలాన్ని స్వలాభం కోసం అభివృద్ధి పేరిట కొట్టేయాలని వ్యూహరచనతో ముందుకెళ్తుండటం దుర్మార్గం.

– సునీల్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే, పూతలపట్టు నియోజకవర్గం

ఖాళీ చేయించాలని చూస్తే సహించం



బస్టాండు వ్యాపారులను ఖాళీ చేయించాలని చూస్తే సహించం. పీసీఆర్ జంక్షన్ సమీపంలో నగరపాలక సంస్థ సొమ్ము రూ.20 లక్షలు ఖర్చు చేసి అక్రమంగా దుకాణాలు కట్టారు. వ్యాపారులతో మైండ్ గేమ్ ఆడి గ్రూపులుగా విడగొట్టారు. అధికార పార్టీ నేతలు మీలో విభేదాలు సృష్టించి వారు పబ్బం గడుపుకోవడానికి చూస్తున్నారు. మీకు అండగా కరుణన్న, విజయానందరెడ్డి, పార్టీ ఉంటుంది. ఎవరూ అధైర్యపడకండి. – చంద్రశేఖర్, డిప్యూటీమేయర్

మీ కోసం రూ.కోట్లు ఖర్చు చేశారు



కాయకష్టం చేసే మీ కోసం మార్కెట్ గేటును కోట్లు వెచ్చించి విజయానందరెడ్డి గతంలో ఉచితం చేశారు. బడుగు, బలహీన, మైనారిటీ వర్గాలు బతికే స్థలంపై కూటమి నేతల కన్నుపడింది. షాపింగ్ క్లాంపెక్స్ పేరిట అస్మదీయులకు స్థలాన్ని ఇవ్వాలని కుట్రలు చేస్తున్నారు. మీకు అండగా ఉండి ఆ పనిని అడ్డుకుంటాం.

–గాయత్రీదేవి, మాజీ జిల్లా అధ్యక్షురాలు, మహిళా విభాగం వైఎస్సార్‌సీపీ

మారని టీడీపీ నైజం



టీడీపీ అధికారంలో వచ్చిన ప్రతిసారీ మా స్థలంపై కన్నేస్తున్నారు. బస్టాండ్ లోపలకు రాకుండా దాదాపు చుట్టూ రేకులు అడ్డుగా వేశారు. అమ్మకాలు తగ్గిపోయాయి. అప్పుల బాధతో ఓ వ్యాపారి ఆత్మహత్య తప్ప మరో మార్గం లేదని ఏడ్చాడు. దీంతో బస్టాండ్ షాప్‌కీపర్స్ అసోసియేషన్ పరంగా సాయం చేశారు. సమస్యలపై కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చారు. వైఎస్సార్‌సీపీ మాకు మద్దతు ఇవ్వడం మాకు ధైర్యాన్నిచ్చింది. – గోపి, వ్యాపారి

మా ఓట్లు కావాలి..బాధలు పట్టవా..?



40 ఏళ్లకు పైగా రోడ్డు మీద తోపుడుబండ్లు పెట్టుకుని వ్యాపారం చేస్తున్నాం. అన్ని మార్కెట్లను ఇక్కడే పెడితే బాగుంటుంది. ఎన్నికలప్పుడు అన్ని పరిష్కరిస్తామని నాయకులు హామీలు ఇచ్చారు. తీరా అధికారంలో వచ్చాక మా బాధలు పట్టడం లేదు. కూటి కోసం పోరాటాలు చేస్తున్నాం. కానీ వ్యాపారులపై దయ లేకుండా వ్యవహరిస్తున్నారు. మేము ఎవరికీ వ్యతిరేకం కాదు.

–రిజ్వాన్, తోపుడు బండి వ్యాపారి

బస్టాండే మాకు జీవనాధారం



బస్టాండ్‌పై ఆధారపడి బతుకుతున్నాం.మా గుడిసెలు కూల్చకండి. నాలుగు తరాలుగా ఇక్కడే పిన్నులు, రిబ్బన్లు, చిన్నచిన్న వస్తువులు అమ్ముకుంటూ బతుకుతున్నాం. షికారీలైన మాకు జీవనాధారం ఈ బస్టాండే. దీనిని వదిలి బయటకు పోతే మాకు తిండి కూడా దొరకదు. మా విజయన్న సాయం చేస్తామని వచ్చారు వీళ్లే మా పాలిట దేవుళ్లు.

– దీపిక, చిరువ్యాపారి

42 ఏళ్లుగా ఇక్కడే ఉన్నాం



42 ఏళ్లుగా ఇక్కడే వ్యాపారం చేసుకుంటున్నాం. ఎన్నికల ప్రచార సమయంలో టాయిలెట్స్ కట్టించాలని ప్రస్తుత ఎమ్మెల్యేకు మొర పెట్టుకున్నా స్పందించలేదు. మా డాక్యుమెంట్లు చూపించాలని అధికారులు పదేపదే అడుగుతున్నారు. ఎన్నిసార్లు చూపించినా వాటిలోని వివరాలు మారవు కదా! ఖాళీ చేయాలని బెదిరిస్తే ఊరుకోం. మా కష్టాన్ని గుర్తించి విజయన్న, కరుణన్న ఇక్కడికి రావడం సంతోషంగా ఉంది. – బుజ్జి, వ్యాపారి

నివాళి



జగదీష్ మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న డాక్టర్ సునీల్‌కుమార్

ఐరాల: మండలంలోని చెంగనపల్లెకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు జగదీష్(58) శుక్రవారం మృతి చెందారు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన పరిస్థితి విషమించడంతో తుది శ్వాస విడిచారు. విషయం తెలుసుకున్న పూతలపట్టు మాజీ ఎమ్మెల్యే, నియోజవర్గ సమన్వయకర్త డాక్టర్ సునీల్‌కుమార్ ఆ గ్రామానికి వెళ్లి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి ప్రగాఢ సంతాపం తెలియజేశారు. మృతుడికి భార్య చిలకమ్మ మాజీ ఎంపీటీసీ సభ్యురాలు. జగదీష్‌కు కుమారుడు, కుమార్తె ఉన్నారు.

అర్ధగిరికి లైట్లు విరాళం



అర్ధగిరి వీరాంజనేయస్వామి ఆలయ ఈఓ హనుమంతుకు లైట్లను అందజేస్తున్న దాత

చౌడేపల్లె: అర్ధగిరి వీరాంజనేయస్వామి ఆలయానికి చౌడేపల్లె మండలం పరికిదొన సర్పంచ్ లక్ష్మీదేవి బాబు దంపతులు లైట్లను విరాళంగా శుక్రవారం అందజేశారు. ఫోక్సింగ్ లైట్లను ఆలయ ఈఓ హనుమంతుకు అప్పగించారు. ఈఓ విజ్ఞప్తి మేరకు లైట్లు సమకూర్చినట్లు దాత తెలియజేశారు. అనంతరం ఆయన్ను ఈఓ సత్కరించి ప్రసాదాలు అందజేశారు. ఆయన వెంట శెట్టిపేట సర్పంచ్ ఓబుల్ రెడ్డి, బోయకొండ ఆలయ మాజీ డైరెక్టర్ శంకరప్ప ఉన్నారు.

సామాజిక మాధ్యమాలకు దూరంగా ఉండండి

- విద్యార్థులకు ఉచిత కళ్లజోళ్ల పంపిణీలో కలెక్టర్ హితవు



విద్యార్థికి కళ్లద్దాలను అందజేస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ

చిత్తూరు కలెక్టరేట్ : విద్యార్థులు సామాజిక మాధ్యమాలకు దూరంగా ఉండాలని కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ హితవు పలికారు. శుక్రవారం స్థానిక పీసీఆర్ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు ఉచిత కళ్లద్దాలను పంపిణీ చేసి ఆయన మాట్లాడారు. జిల్లాలో కంటి సమస్యలతో బాధపడుతున్న 3.500 మంది విద్యార్థులకు ఉచితంగా కళ్లద్దాలు ఇస్తున్నామన్నారు. ప్రస్తుత డిజిటల్ యుగంలో విద్యార్థులు మొబైల్ ఫోన్లకు బానిసలవుతున్నారని, డిజిటల్ మాధ్యమాలు ఎక్కువగా వినియోగించడం వల్ల చిన్న వయస్సులోనే కళ్లద్దాలు పెట్టుకోవాల్సి వస్తోందన్నారు. తల్లిదండ్రులు దీనిపై దృష్టి పెట్టి పిల్లలను కట్టడి చేయాలన్నారు. విద్యార్థులకు చదువుతోపాటు క్రీడల్లో కూడా ఆసక్తి పెంచాలన్నారు. సైబర్ క్రైమ్‌పై అవగాహన కలిగి ఉండాలని, క్రికెట్ బెట్టింగ్..మొదలైన వాటికి కూడా దూరంగా ఉండాలని హితోక్తులు పలికారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడారు. నగర మేయర్ అముద, చుడా చైర్మన్ కఠారి హేమలత, డీఈఓ వరలక్ష్మి, హెచ్‌ఎం పూర్వాణి తదితరులు పాల్గొన్నారు.

నేత్ర సంరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలి



విద్యార్థినికి కళ్లజోడు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

ఐరాల: నేత్ర సంరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని, ఎమ్మెల్యే మురళీమోహన్ కోరారు. శుక్రవారం మండలంలోని కాణిపాకం జెడ్పీ హైస్కూల్‌లో జాతీయ అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. శిబిరంలో జిల్లా అంధత్వ ప్రోగ్రాం మేనేజర్ డాక్టర్ అర్పిత 400 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు చేశారు. వీరిలో 27 మంది దృష్టి లోపంతో బాధపడుతున్నట్టు గుర్తించారు. వారికి ఎమ్మెల్యే చేతుల మీదుగా ఉచిత కళ్లజోళ్లను పంపిణీ చేశారు. డాక్టర్ అర్పిత మాట్లాడుతూ, ఆధునిక యుగంలో టీవీలు, స్మార్ట్ ఫోన్లు ఎక్కువగా వాడడం వల్ల కంటి శుక్లాలు దెబ్బ తింటున్నాయన్నారు. తల్లిదండ్రులు విద్యార్థులను సాధ్యమైనంత వరకు స్మార్ట్‌ఫోన్లకు దూరంగా ఉంచాలని చెప్పారు. కార్యక్రమంలో హెచ్‌ఎం చంద్రశేఖర్‌నాయుడు, కాణిపాకం పీహెచ్‌సీ వైద్యాధికారులు స్వాతి సింధూర, రాజేశ్వరి, కంటి వైద్యుడు హరిప్రసాద్, ఎంపీహెచ్ఈఓ శివయ్య, హెల్త్ సూపర్‌వైజర్లు నాగరత్నమ్మ, మనోహర్, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించాలి

చిత్తూరు అర్బన్: చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ పారిశుద్ధ్య కార్మికుల సమస్యలను పరిష్కరించాలని లేని పక్షంలో పోరాటం తప్పదని వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ జిల్లా గౌరవాధ్యక్షుడు నాగరాజు హెచ్చరించారు. శుక్రవారం చిత్తూరు నగరపాలక సంస్థ అధికారులను ఆయన కలిసి కార్మికుల సమస్యలపై వినతి పత్రం ఇచ్చారు. పారిశుద్ధ్య విభాగంలో పనిచేస్తున్న పర్మినెంట్, ఔట్‌సోర్సింగ్ కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో అధికారుల నిర్లక్ష్య వైఖరిని వీడి 16 సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. నాయకులు విజయ్‌కుమార్, జయశంకర్, గంగయ్య, వినాయకం రమణి తదితరులు పాల్గొన్నారు.

డిజిటల్ గుర్తింపు కార్డు నమోదు వేగవంతం చేయాలి



కార్డుల నమోదును పరిశీలిస్తున్న ఏఓ ప్రవీణ్

తవణంపల్లె: మండలంలోని రైతు సేవా కేంద్రాల్లో రైతు డిజిటల్ గుర్తింపు కార్డుల నమోదు కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని మండల వ్యవసాయాధికారి జి. ప్రవీణ్ ఆదేశించారు. శుక్రవారం మండలంలోని పట్నం, దిగువమాఘం, అరగొండ, చెర్లోపల్లె రైతు సేవా కేంద్రాల్లో రైతు డిజిటల్ గుర్తింపు కార్డు నమోదు కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. తప్పిదాలు లేకుండా యాప్‌లో నమోదు చేయాలని, ఈ నెలాఖరులోగా ఈ కార్యక్రమాన్ని పూర్తి చేయాలన్నారు.

సంజీవయ్యకు ఘన నివాళి

చిత్తూరు అర్బన్: ఆంధ్రప్రదేశ్ తొలి దళిత ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య జయంతి పురస్కరించుకుని శుక్రవారం చిత్తూరు నగరపాలక సంస్థ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి ఘన నివాళులు అర్పించారు. మేయర్ ఎస్.అముద, కమిషనర్ పి.నరసింహ ప్రసాద్, సహాయ కమిషనర్ ఏ.ప్రసాద్, డిప్యూటీ మేయర్ రాజేష్ కుమార్ రెడ్డి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఎంహెచ్ఓ డాక్టర్ లోకేష్, ఏసీపీ నాగేంద్ర, సీఎంఎం నాగేంద్ర, అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

18న రౌండ్ టేబుల్ సమావేశం

చిత్తూరు కార్పొరేషన్: కేంద్ర బడ్జెట్‌కు వ్యతిరేకంగా ఈనెల 18న జిల్లా కేంద్రంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించనున్నట్టు సీపీఐ, సీపీఎం జిల్లా కార్యదర్శులు నాగరాజన్, గంగరాజు తెలిపారు. శుక్రవారం చిత్తూరులో వారు మాట్లాడారు. వామపక్షాల పిలుపు మేరకు 20వ తేదీ వరకు నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. నాయకులు సురేంద్రన్, బాలసుబ్రమణ్యం, మణి పాల్గొన్నారు.

రోడ్డు భద్రత, ఆరోగ్యం ముఖ్యం



ఉత్తమ డ్రైవర్లను సన్మానిస్తున్న అధికారులు

చిత్తూరు రూరల్(కాణిపాకం): రోడ్డు భద్రతతో పాటు ఉద్యోగుల ఆరోగ్యం కూడా ముఖ్యమని డీటీసీ నిరంజన్‌రెడ్డి అన్నారు. చిత్తూరు ఆర్టీసీ–2 డిపో గ్యారేజీలో శుక్రవారం రోడ్డు భద్రత మాసోత్సవాలను నిర్వహించారు. డీటీసీతోపాటు డీసీహెచ్ఎస్ ప్రభావతి మాట్లాడారు. డ్యూటీకి వెళ్లేముందు బస్సు కండిషన్ చూసుకోవాలన్నారు. ఏకాగ్రతతో నడుపుతూ ప్రయాణికులను గమ్యస్థానాలకు సురక్షితంగా చేర్చాలన్నారు. డ్రైవర్లు చాలా మంది గుండె పోటుకు గురై మరణిస్తున్నారని, దీనిని దృష్టిలో ఉంచుకుని విధిగా ఆరోగ్య పరీక్షలు చేసుకోవాలని డీసీహెచ్ఎస్ కోరారు. గుండెపోటుకు గురైన వ్యక్తిని తక్షణమే సమీపంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తే రూ. 45వేల విలువ చేసే ఇంజెక్షన్‌ను ఉచితంగా వేస్తారన్నారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్య సంరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. అనంతరం స్టెమీ కార్యక్రమ పోస్టర్లను ఆవిష్కరించారు. ఉత్తమ డ్రైవర్లు, ఎంవీఐ రాజేశ్వరరావును సన్మానించారు. డీపీటీఓ జగదీష్, సీఐ అల్తాఫ్ పాల్గొన్నారు.

తపాల ఉద్యోగుల ఆందోళన

చిత్తూరు కార్పొరేషన్: తపాలాశాఖ ఉద్యోగులు శుక్రవారం సాయంత్రం ప్రధాన తపాలా శాఖ కార్యాలయం ఆందోళన చేశారు. ఔట్‌సోర్సింగ్ ద్వారా ఉత్తరాల బట్వాడా నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని, ఆర్‌ఎంఎస్‌ను మూసివేయరాదన్నారు. రేషనలైజేషన్ పేరిట పోస్టాఫీసులను మూసివేయాలని ప్రయత్నాలు చేస్తున్నారని, వీటికి నిరసనగా దశలవారీ ఆందోళన చేయాలని నిర్ణయించామన్నారు. ప్రైవేటీకరణకు స్వస్తి పలకాలన్నారు. కార్యక్రమంలో నాయకులు భాస్కర్, సర్దార్, మహదేవన్, పురుషోత్తం, రామ్మూర్తి, మోహనరాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఫార్మర్ రిజిస్ట్రేషన్ వేగవంతం చేయాలి



ఫార్మర్ రిజిస్ట్రేషన్‌ను పరిశీలిస్తున్న ఏఓ వరలక్ష్మి

ఐరాల: రైతు సేవా కేంద్రాల్లోని వ్యవసాయ సిబ్బంది రైతులకు ఫార్మర్ రిజిస్ట్రేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని ఏఓ వరలక్ష్మి ఆదేశించారు. శుక్రవారం మండలంలోని ఐలవారిపల్లె ఆర్‌ఎస్‌కేలో ఫార్మర్ రిజిస్ట్రేషన్‌ను పరిశీలించి ఆమె మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం రైతులకు 14 అంకెల ప్రత్యేక విశిష్ట గుర్తింపు సంఖ్య(యూనిక్ ఐడీ) ఆధార్ కార్డు తరహాలో రైతులకు అందజేయనుందని, దీనివల్ల పీఎం కిసాన్, పెట్టుబడి సాయం, పంటల బీమా, రాయితీపై సూక్ష్మ పోషకాలు, అన్నదాత సుఖీభవ, రాయితీపై వ్యవసాయ యంత్ర పరికరాలు, పంట రుణాలపై వడ్డీ రాయితీ, సూక్ష్మ సేద్యంపై రాయితీ తదితర ప్రయోజనాలు పొందవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో వీఏఏ రెడ్డెప్ప, రైతులు పాల్గొన్నారు.

గ్రామాల్లో విచ్చలవిడిగా బెల్ట్ షాపులు



మండల సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జి ఎంపీడీఓ శ్రీధర్

- జోరుగా మద్యం సరఫరా
- పోలీసులు, ఎక్సైజ్ అధికారులు పట్టించుకోరా..?
- మండల సమావేశంలో ధ్వజమెత్తిన ఎంపీపీ, సభ్యులు

బంగారుపాళెం:"గ్రామాలలో బెల్ట్‌షాపులు విచ్చలవిడిగా వెలిశాయి.. ఆటోలు, ద్విచక్ర వాహనాలపై మద్యాన్ని బెల్ట్ షాపులకు సరఫరా చేస్తున్నా ఎక్సైజ్, పోలీస్ అధికారులు పట్టించుకోరా?"అని మండల సర్వసభ సమావేశంలో ఎంపీపీ అమరావతి అధికారులను నిలదీశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ భవనంలో ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ సమావేశం నిర్వహించారు. తొలుత ఎంపీపీ, శెట్టేరి సర్పంచ్ అనిల్ బెల్ట్ షాపుల సమస్యలపై మాట్లాడారు. అలాగే, రైతులకు రైతు సేవా కేంద్రాల ద్వారా యూరియా సరఫరా చేయకపోవడం వల్ల రైతులు పనులు మానుకుని మండల కేంద్రాలు, ఇతర ప్రాంతాల్లో ప్రైవేటు దుకాణాలకు వెళ్లి ఇబ్బందుల నడుమ యూరియా బస్తాలు తెచ్చుకోవాల్సిన పరిస్థితులు నెలకున్నాయన్నారు. దీనిపై వ్యవసాయాధికారి ప్రవీణ్ స్పందిస్తూ, త్వరలో రైతు సేవా కేంద్రాల ద్వారా రైతులకు యూరియా పంపిణీకి చర్యలు తీసుకుంటామన్నారు. మండలంలో పలు గ్రామాల్లో విద్యుత్ వైర్లు, కరెంటు స్తంభాలు ప్రమాదకరంగా ఉన్నాయని, వాటికి మరమ్మతులు చేయాలని, ఇటీవల చోటుచేసుకున్న కరెంటు ప్రమాదాలను ఉదహరించారు. దీనిపై స్పందించిన ఏఈ దేవీప్రసన్న మాట్లాడుతూ, లూజ్ లైన్లు, ప్రమాదకర కరెంటు స్తంభాలను గురించి తెలియజేస్తే తక్షణం చర్యలు తీసుకుంటామన్నారు. వైస్ ఎంపీపీ శిరీష్‌రెడ్డి మాట్లాడుతూ, మొగిలివెంకటగిరి పంచాయతీకి డంపింగ్ కేంద్రాన్ని మంజూరు చేయాలని కోరారు. అలాగే, జాతీయ రహదారి వద్ద బ్రిటీష్ కాలం నాటి డ్యామ్‌లను పూడ్చి వేయడం వల్ల మురుగు నీరు రహదారిపై ప్రవహిస్తోందని, అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు. మండలంలో డెంగీ కేసులు అధికంగా నమోదు అవుతున్నాయని, గ్రామాల్లో పారిశుధ్యంపై ప్రజాప్రతినిధులు ప్రత్యేక దృష్టి సారించాలని మండల వైద్యాధికారి డాక్టర్‌లోహిత్ చెంగల్‌రాయన్ కోరారు. వైద్య ఆరోగ్య సిబ్బందికి ప్రజా ఆరోగ్య సేవలు తప్పితే ఇతర కార్యక్రమాల నుంచి మినహాయించాలన్నారు. ఆరోగ్య కార్యకర్తలకు ఇతర పనులు అప్పగించడం వల్ల ప్రజాఆరోగ్య సేవలు కుంటుపడుతున్నాయన్నారు. సర్వేలు చేయడం లేదని గ్రామ కార్యదర్శులు ఆరోగ్య కార్యకర్తలకు జీతాలు పెట్టకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నట్లు సమావేశంలో ప్రస్తావించారు. పలువురు మహిళలు గ్రామాల్లో మద్యం బెల్ట్ షాపుల్లో జోరుగా అమ్మకాలు సాగిస్తున్నారని తన దృష్టికి తీసుకు వచ్చారని, గ్రామాల్లో మద్యం బెల్ట్‌షాప్‌ల నిర్వాహకులపై సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని ఎంపీపీ ఆదేశించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీఓ శ్రీధర్ మాట్లాడారు. తహసీల్దార్ బాబురాజేంద్రప్రసాద్, కో–ఆప్షన్ సభ్యుడు ఫిరోజ్ అహ్మద్, వివిధ శాఖల అధికారులు, సర్పంచులు, గ్రామ కార్యదర్శులు, వీఆర్ఓలు పాల్గొన్నారు.



హాజరైన అధికారులు, ప్రజాప్రతినిధులు

పాత్రికేయుడి మృతి



గోపీనాథరెడ్డి

తవణంపల్లె: మండలానికి సంబంధించి ఎలక్ట్రానిక్ మీడియాలో పని చేస్తున్న పాత్రికేయుడు గోపీనాథరెడ్డి అనారోగ్యంతో బాధపడుతూ శుక్రవారం మృతి చెందాడు. తొడతరకు చెందిన గోపీనాథరెడ్డికి లివర్, కిడ్నీ సమస్యలతో నాలుగు రోజులుగా వేలూరులోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో మరణించాడు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని జిల్లా ఏపీయూడబ్ల్యూజే జిల్లా కమిటీ, తవణంపల్లె మండల ప్రెస్‌క్లబ్ కమిటీతో పాటు పలువురు జర్నలిస్టులు ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు.